క్లుప్తంగా

కమనీయం.. వేంకటేశ్వర స్వామి కల్యాణం


వెంకటేశ్వరస్వామికి కల్యాణం చేస్తున్న అర్చకులు

వాకాడు : మండలంలోని దుగ్గరాజపట్నం గ్రామంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ 9వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. ముందుగా అర్చకులు అభిషేకాలు, అర్చనలు, వివిధ రకాల పూజలు, హోమాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం వేకువజామున స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు.

ఈఏపీ సెట్‌లో ఫలితాల్లో నాయుడుపేట విద్యార్థుల ప్రతిభ


ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు

నాయుడుపేట టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈఏపీ సెట్ ఫలితాల్లో నాయుడుపేట శ్రీవేమ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ పెమ్మారెడ్డి శ్రీనివాసులు రెడ్డి బుధవారం తెలిపారు. ఎస్.స్నేహలత 982వ ర్యాంకు, కె.పవన్ 7,032, కృష్ణ చేతన్ 7,232, ఆదిత్య 7,933, శ్రీసాయిజ్యోతి 8,011, డి.మేఘన 9,808, సి.సోమశేఖర్ 10,622 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో మొత్తం 180 మంది పరీక్షలు రాయగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఆయన నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అధ్యాపకులు శ్రావన్, కృష్ణ, హరినాథ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం


విద్యార్థినికి నగదు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

గూడూరు రూరల్ : పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన గూడూరుకు చెందిన పసుపులేటి శృతి అనే విద్యార్థినికి బుధవారం బలిజ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ సారంగదేవి లలిత సహకారంతో రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే సీనియర్ ఇంటర్ చదువుతున్న నామాల దుర్గాదేవికి వైజాగ్‌కు చెందిన హైమావతి రూ.2 వేల సాయం చేశారు. ఈ మొత్తాన్ని బలిజ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పద్మావతి అందజేశారు. వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు తమ సంఘం ఎప్పుడూ సాయం అందిస్తుందన్నారు. సంఘం గౌరవ అధ్యక్షురాలు సారంగం సులక్ష్మి, పి.ఉమాదేవి, రాధిక, ఉష, రాధ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు చీరల పంపిణీ


గిరిజనులకు చీరలు పంపిణీ చేస్తున్న గంగాబాబు

నాయుడుపేట టౌన్ : మండలంలోని శ్రీనివాసపురం ఎస్టీ కాలనీకి చెందిన గిరిజన మహిళలకు బుధవారం నాయకులు పనబాక గంగాబాబు సోదరులు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ పకబాక భూలక్ష్మీ పుట్టిన రోజుతోపాటు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తుండడంపై పేదలకు సహాయక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం కాలనీలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పనబాక సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పాదచారులకు నీడనిస్తున్న చెట్లు


మోమిడి ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

చిల్లకూరు : మండలంలోని కోట రోడ్డులోని కడివేడు సమీపంలో రాజ్యలక్ష్మీ కాలనీ, గుత్తావారిపాళెం, చింతవరం నుంచి ఏరూరుకు వెళ్లే రోడ్డులో ఇరువైపులా ఉన్న చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో అటుగా వెళ్లే ద్విచక్రవాహనదారులు, పశువుల కాపరులు ఆ చెట్ల నీడన సేదతీరుతున్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలునాటి సంరక్షిస్తే అవి పెరిగి పెద్దవి అయి ఆక్సిజన్‌తోపాటు నీడను ఇస్తాయని అధికారులు చెబుతున్నారు.

రోసనూరు–శిరసనంబేడు ప్రాంతంలో ఉన్న అడవులు




రోసనూరు అటవీ ప్రాంతంలో జింకల వేట

నేలపట్టు పక్షుల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రోసనూరు–శిరసనంబేడు అటవీ ప్రాంతంలో జింకల వేట యథేచ్ఛగా సాగుతోంది. కొంతమంది వేటగాళ్లు విద్యుత్ కంచె ఏర్పాటుచేసి జింకలు, దుప్పులు, కుందేళ్లను వేటాడుతున్నారు. వాటి మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా అటవీశాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. – పెళ్లకూరు


చుక్కల జింకలు


విద్యుత్ కంచెతో గిరిజనుడి కాలికి అయిన గాయం

పెళ్లకూరు మండలం రోసనూరు–శిరసనంబేడు ప్రాంతాల్లో 2,914 ఎకరాల అటవీ భూములు, మరో 1,663 ఎకరాలు సోషల్ ఫారెస్టు మొత్తం 4,577 ఎకరాల్లో చిట్టడవులు ఉన్నాయి. ఈ ప్రాంతాల మీదుగా తెలుగు గంగ 7వ బ్రాంచ్ కాలువ, రోసనూరు, కానూరు, శిరసనంబేడు, బంగారంపేట గ్రామాలకు చెందిన చెరువులు ఉన్నాయి. దీంతో అడవి జంతువులకు తాగునీరు బాగా లభిస్తుండడంతో ఇక్కడి అడవుల్లో చుక్కల దుప్పులు, జింకలు, కుందేళ్లు, నక్కలు ఆవసాలు ఎక్కువగా ఉన్నాయి. కొంత కాలంగా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో అడవి జంతువులు దాహార్తితో అలమటిస్తూ గ్రామాల్లోని నివాసాల వద్దకు వస్తున్నాయి. దీంతో కొందరు వేటగాళ్లు అడవి జంతువులను వేటాడుతున్నారు. జంతువులు సంచరించే ప్రదేశాల్లో రహస్యంగా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా కాటూరు, బుచ్చినాయుడు కండ్రిగ, కాళంగి తదితర ప్రాంతాలకు చెందిన కొందరు గుర్తు తెలియని వేటగాళ్లు రాత్రి వేళల్లో జింకలు, దుప్పులు, కుందేళ్లను వేటాడి వాటి మాంసాన్ని నాయుడుపేట, సూళ్లూరుపేటతో పాటు చెన్నై ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వేటగాళ్లు అటవీ పరిసర ప్రాంతాల్లోని కొందరు గిరిజనులకు నగదు ఎర చూపి జింకల వేట సాగిస్తున్నట్లు తెలుస్తోంది. నేలపట్టు పక్షుల కేంద్రానికి కూతవేటు దూరంలో జింకల వేట కొనసాగుతున్నా ఇక్కడి అటవీశాఖ అధికారులు తమకు పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అటవీప్రాంతాల్లో రాత్రి సమయాల్లో జరుగుతున్న జింకల వేటను అరికట్టాలని కోరుతున్నారు.

విద్యుత్ కంచెతో ప్రమాదం

అడవి జంతువుల కోసం వేటగాళ్లు రహస్యంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. ఇటీవలే అడవుల్లో వంట చెరుకు కోసం వెళ్లిన తుపాకుల అంకయ్య, వేటగిరి పోలయ్య విద్యుత్ కంచె తగిలి గాయాలపాలయ్యారు. అటవీ ప్రాంతాల్లో చాలా కాలంగా విద్యుత్ కంచె ఏర్పాటు చేసినప్పటికీ ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్న వేటగాళ్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు చేపడతాం

రోసనూరు అటవీ ప్రాంతంలో అక్రమంగా విద్యుత్ కంచె ఏర్పాటు చేసినట్టు ఫిర్యాదులు అందలేదు. అలాగే అడవి జంతువుల వేటపైనా విచారణ చేస్తాం. నిందితులను కఠినంగా శిక్షిస్తాం.

– ధనలక్ష్మి, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో

సీఎం ప్రమాణ స్వీకారం వీక్షణ


నాయుడుపేట అంబేడ్కర్ భవన్‌లో సీఎం ప్రమాణ స్వీకారాన్ని లైవ్‌లో వీక్షిస్తున్న అధికారులు, మహిళలు

నాయుడుపేట టౌన్/దక్కిలి/వెంకటగిరి రూరల్ : ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు ప్రత్యక్షంగా తిలకించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నాయుడుపేటలోని అంబేద్కర్ భవన్ వద్ద, అలాగే డక్కిలిలోని ఎంపీడీవో కార్యాలయం, అలాగే వెంకటగిరి మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయం, నాగేశ్వరి ఫంక్షన్ హాల్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, మేనేజర్ ఎంకే ఖాజా మొహిద్దీన్, డక్కిలి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో లీలామాధవి, వెంకటగిరికి చెందిన టీడీపీ నేతలు పులుకొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, గంగాధర్, జానపాటి బాలకృష్ణ, చంద్రమౌళిరెడ్డి, తంబిరెడ్డి తనుజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలుచోట్ల టీడీపీ నేతలు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, కేక్‌లు కట్ చేసుకుని సంబరాలు చేసుకున్నారు. నాయుడుపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అత్తికాయల సుబ్రమణ్యం, షేక్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి రెయిలింగ్


లింగసముద్రం బ్రిడ్జి వద్ద విరిగిపోయిన ఇనుప రాడ్లు

దక్కిలి: మండలంలోని లింగసముద్రం వద్ద అలప లేరుకు అడ్డంగా రాపూరు–వెంకటగిరి జాతీయ రహదారిలో నిర్మించిన బ్రిడ్జికి ఒక వైపు ఏర్పాటు చేసిన రక్షణ ఇనపరాడ్లు విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు అదుపుతప్పితే వాహనాలతో పాటు వాగులో పడే ప్రమాదం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇనుప రాడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గిరిజన గురుకులంలో విద్యార్థుల చేరిక


ఏపీ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తున్న మల్లికార్జున్

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని ఏపీ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం బాలాయపల్లి మండలం అంబలపూడికి చెందిన ముగ్గురు గిరిజన విద్యార్థులు చేరారు. వారిని గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున్ చేర్పించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు చదువే ఆయుధమని, విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సెక్రటరీ ఇండ్ల మల్లికార్జున్, నరసింహులు పాల్గొన్నారు.

అమ్మ సంబరం.. ఊరూరా ఉత్సాహం



శ్రీకాళహస్తి: ప్రత్యేకాలంకరణలో బంగారమ్మ, బంగారమ్మ ఉత్సవమూర్తి ఊరేగింపు

శ్రీకాళహస్తి: పిచ్చాటూరు రోడ్డులో ఉన్న శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ బంగారమ్మ ఆలయ జాతర బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా అమ్మవారికి పెరుగు, చందనం, పాలు, నారికేళం, కలశ జలాలతో అభిషేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి ముగ్గు వేశారు. సాయంత్రం 4 గంటలకు కుంభం వేశారు. 6 గంటలకు బంగారమ్మ ఉత్సవమూర్తిని ఊరేగించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఈవో ఎస్వీ నాగేశ్వరరావు దంపతులు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి సారె అందజేశారు.

వైభవంగా పొన్నెయమ్మ జాతర

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో పొన్నెయమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. పళ్లికొండేశ్వరస్వామి ఆలయం తరపున ఈవో కె.రామచంద్రారెడ్డి, అర్చకులు, సిబ్బందితో కలిసి అమ్మవారికి సారె సమర్పించారు. ఏటా జాతరకు పళ్లికొండేశ్వరస్వామి ఆలయం నుంచి సారె సమర్పించడం ఆనవాయితీ. అర్చకులు, గ్రామపెద్దలు సంప్రదాయబద్ధంగా సారె స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

నరసరాజు అగ్రహారంలో..

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారంలో గంగమ్మ జాతర వేడుకగా జరిగింది. మంగళవారం రాత్రి 10గంటలకు ప్రారంభమైన ఊరేగింపు బుధవారం ఉదయం తొమ్మిది గంటల వరకు సాగింది. మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తపెట్లు, మేళాలు, బాణాసంచా పేలుళ్ల సందడి నడుమ యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం నడివీధిలో అమ్మవారిని కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారికి ఇంటింటి నుంచి సారె తీసుకువచ్చి సమర్పించారు. గంగమ్మ వెంట గండు దీపం పట్టుకుని భక్తులు నడిచారు. ఇంటింటా కుంభం వేసి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కండలేరులో 6.486 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 6.486 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

15, 16, 17 తేదీల్లో రైతు కూలీ సంఘం మహా సభలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

వెంకటగిరి రూరల్ : రైతాంగ సమస్యల పరిష్కార దిశగా ఏలూరులో 15, 16, 17వ తేదీల్లో రైతు కూలీ సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీవీ రమణయ్య తెలిపారు. ఆయన బుధవారం పల్లెవీధిలోని శ్రీకాళహస్తి శేషయ్య భవనంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహా సభలకు రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. సంఘం కార్యవర్గ సభ్యుడు గంగలపూడి కృష్ణారెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన చంద్రశేఖర్, చెంగయ్య

దొరవారిసత్రం : స్థానిక జాతీయ రహదారిపై బుధవారం ఆవును ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. తడ మండలం మిట్టకండ్రిగకు చెందిన చెంగయ్య (60), అతడి కుమారుడు చంద్రశేఖర్(27) బైక్‌పై నాయుడుపేటకు వెళుతున్నారు. డీవీసత్రం సమీపంలో అడ్డుగా వచ్చిన ఆవును ఢీకొన్నారు. దీంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నై తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేదురుమల్లిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు


నియోజకవర్గ కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర

వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని బుధవారం వెంకటగిరి నియోజకవర్గం నేతలు పలువురు కలిశారు. ఎన్నికల ఫలితాలు, పోలింగ్ సరళి, వైఎస్సార్ సీపీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అదేవిధంగా ఎస్వీబీసీ చైర్మన్, వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర కూడా నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించుకున్నారు.

వాటర్ ట్యాంకుల నిర్వహణ ఏదీ..?


తనియాలిలోని ఓవర్ హెడ్ ట్యాంక్

దొరవారిసత్రం : మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్వహణను అధికారులు పూర్తిగా మరిచిపోయారు. ట్యాంకుల్లో పాచిపట్టి నీటిలో పురుగులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. సాధారణంగా ఆరు నెలలకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉంటుంది. అంతేగాక దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేయాలి. మండలంలో సుమారు 30 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ఇందులో పలు గ్రామాల్లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్వహణను అధికారులు పూర్తిగా మరిచిపోవడంతో దెబ్బతింటున్నాయి. అవి ఎప్పుడు కూలిపోతాయోనని గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కట్టువాపల్లి ఎస్సీ కాలనీ, తనియాలి, డీవీ సత్రం, పూలతోట, మీజూరు తదితర గ్రామాల్లోని ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కట్టువాపల్లి, ఎస్సీ కాలనీ, నెల్లూరుపల్లి గ్రామంలోని వాటర్ ట్యాంక్‌కు చెందిన నిచ్చెనలు పూర్తిగా దెబ్బతినడంతో ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చేసి ఏళ్లు గడుస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మరికొన్ని ట్యాంకులు పెచ్చులు పెచ్చులుగా ఊడిపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ



స్వర్ణముఖి నది పక్కనే ఆఆక్రమణకు గురైన భూమి, శ్మశానంలో ఉన్న చెట్లను తొలగించిన ఆక్రమణదారులు

ఓజిలి: మండలంలోని జోష్యులవారికండ్రిగలో కొంతమంది ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. స్వర్ణముఖినది పక్కనే ఉన్న కట్టను సైతం ఆక్రమించి సాగుకు అనుకూలంగా చేసుకుంటున్నారు. గ్రామంలో సర్వే నంబర్ 113, 120లలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని ఇప్పటికే కొంతమంది గ్రామస్తులు ఆక్రమించుకున్నారు. శ్రీకృష్ణ మందిరం–ఆంజనేయస్వామి ఆలయ భూమి, శ్మశానానికి కేటాయించిన భూమిని సైతం ఆక్రమించుకుని జేసీబీలతో చదును చేసి పంటలను సాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకున్న గ్రామస్తులపై దౌర్జన్యానికి దిగుతున్నారు. భూమి స్వర్ణముఖి నది పక్కనే ఉండడంతో సాగునీరు పుష్కలంగా లభిస్తోంది. దీంతో వరి, శనగ, మిరప పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. గతంలో పనిచేసిన కొంతమంది రెవెన్యూ అధికారులు గ్రామస్తుల నుంచి అధిక మొత్తంలో నగదు వసూలు చేసి భూమి ఆక్రమణపై చూసీ చూడనట్టు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇకనైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నాంచారయ్యను వివరణ కోరగా వీఆర్వోతో విచారణ చేయించి ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకుంటామన్నారు.

నేత్రపర్వంగా ద్రౌపదీ కల్యాణం


కల్యాణం చేస్తున్న ఆలయ పూజారి

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. పూజారి రవి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. వివిధ హోమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. బుధవారం స్వామి అమ్మవార్లను ఊరేగించారు. సాయంత్రం భాగవతారిణి రెడ్డెమ్మ ద్రౌపదీ వస్త్రాపహరణం హరికథా గానం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సర్పంచ్ మంజుల, మాజీ జెడ్పీటీసీ మునిరంగారెడ్డి, ఆలయ చైర్మెన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మహా కుంభాభిషేకం

పిచ్చాటూరు: మండలంలోని రజానగరంలో నిర్మించిన విఘ్నేశ్వరాలయ మహా కుంభాభిషేకం బుధవారం భక్తిప్రపత్తులతో జరిగింది. వేకువజామున 3.30 గంటలకు సంకల్పబింబ శుద్ధి, రక్షాబంధనం, హోమ పూజలు, మహాపూర్ణాహుతి, గోపూజ, గజపూజ, అష్టపూజ చేశారు. ఉదయం 6.30 గంటలకు కలశ ఊరేగింపు, విమాన గోపుర కలశ కుంభాభిషేకం, మూలవిగ్రహం కుంభాభిషేకం, దీపారాధన, మహాప్రసాద వినియోగం, 9 గంటలకు గర్భాలయంలో స్వామివారికి మహా అభిషేకం చేశారు.

తొలకరి వానలతో సాగుకు రైతులు సిద్ధం


మంగళంపాడులో ఎల్లిపైర్లు వేసుకునే పొలంలో ఎరువు తోలుతున్న దృశ్యం


తీరప్రాంతగ్రామంలో ఎల్లిపైర్లు వేసుకోవడానికి దుక్కులు దున్నుతున్న రైతులు

సూళ్లూరుపేట : వారం రోజుల నుంచి అప్పుడప్పుడు వానలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సూళ్లూరుపేట ప్రాంతంలో తగిన సాగునీటి వసతి లేకపోవడం, ఎక్కువగా మెట్ట ప్రాంతాలు ఉండడంతో ఒక పంట కే పరిమితమవుతున్నారు. దీంతో నాలుగు నెలలు సేద్యంతో బిజీగా వుండే రైతులు మిగిలిన 8 నెలలు ఖాళీగానే వుంటారు. జూన్ ప్రారంభం కావడం, నైరుతీ రుతుపవనాల ప్రభావంతో వారం రోజుల నుంచి అడపాదడపా వర్షం పడుతోంది. దీంతో రైతులు పొలాల్లో పేడ ఎరువులు తోలుకోవడం, దుక్కులు దున్నడం తదితర పనులు చేస్తున్నారు. ముఖ్యంగా వినాయక చవితి పండుగలోపు ఎల్లిపైర్లు వేసుకోవడం, వినాయక చవితి నాటికి వినాయకుడి అంత ఎత్తు పైరు వుండాలనేది పెద్దలమాట. మండలంలో సుమారు రెండు వేల హెక్టార్లలో ఎల్లిపైరు వేస్తారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ము మ్మరంగా దుక్కులు దున్నుతున్నారు. మండలంలోని కొరిడి, దామరాయ, కడపత్ర, దామానెల్లూ రు, మంగళంపాడు, ఇలుపూరు, వెలగలపొన్నూరు, మతకామూడి గ్రామాల్లో ఎక్కువగా ఎల్లిపైర్లు వేసుకోవడానికి సిద్ధం చేసుకుంటున్నారు. అదే విధంగా వరినాట్లు వేసుకునే రైతులు కూడా దుక్కు లు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పుడు ఎల్లి దుక్కులు చేసి పెట్టుకుంటే భవిష్యత్తులో పొలంలో కలుపు లేకుండా వుంటుందని రైతులు చెబుతున్నారు. బోర్లు, బావులు కింద నీటి సౌకర్యం వున్న వారు నారుమళ్లు పోసుకుంటున్నారు. వారం రోజులుగా ఆగి ఆగి కురుస్తున్న వర్షాలకు ఎల్లిపైర్లు వేసుకునే వారు మాత్రం వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా వున్నారు.